క్లుప్తంగా

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ



జైలు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని సబ్‌జైలును జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులోని బ్యారక్‌లు, టాయిలెట్లు వంటగది, స్టోర్‌రూంలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశం నిర్వహించి, ఖైదీ లందరూ జైలు నుంచి విడుదలయిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. చిన్న విషయాలకు పంతాలు, పట్టింపులకు పోయి కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరగకుండా ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ ధనుంజయనాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

భీమేష్ మృతి తీరనిలోటు



వైఎస్సార్‌సీపీ నాయకుడు భీమేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉరవకొండ: భీమేష్‌బాబు మృతి పార్టీకి తీరని లోటు అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సీపీ వీరన్న అన్నారు. బూదగవి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డే భీమేష్ బాబు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. భీమేష్‌బాబు స్వగ్రామానికి చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సూచనల మేరకు ఎంపీపీ నరసింహులు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సుశీలమ్మ, కొకుంట్ల వసంతమ్మ, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు బసవరాజు, బూదగవి గ్రామ సర్పంచ్ ధనంజయ, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, మైనార్టీ నాయకులు ఆసీఫ్ సంతాపం తెలియజేశారు.

పారదర్శకంగా రీసర్వే

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లిలో నిర్వహించిన రీసర్వేను తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి మంగళవారం పరిశీలించారు. గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. రైతులు భూమి రికార్డులతో సర్వేకు సహకరించాలన్నారు. కార్యకమలో సర్వేయర్ బాషా, వీఆర్‌ఓ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలు తనిఖీ

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న పశు వైద్య ఆరోగ్య శిబిరాలను కళ్యాణదుర్గం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు శ్రీనివాసగుప్త మంగళవారం తనిఖీ చేశారు. కాలువపల్లి, బెళుగుప్ప తండాలో రెండు బృందాలుగా పశు వైద్యాధికారులు రమేష్, స్రవంతి పశువులకు వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నారు.పశు వైద్య సహాయకులు మారుతి, విజయ్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సుధాకర్, ఎర్రిస్వామి, రవితేజ, వంశీకృష్ణ, సుదర్శన్, రవి, పూర్ణిమ పాల్గొన్నారు.

లఘు చిత్రాల పండుగ పోస్టర్ల విడుదల

ఉరవకొండ: స్థానిక జైకిసాన్ ఫౌండేషన్ కార్యాలయంలో అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఏడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు చేతుల మీదుగా లఘు చిత్రాల పండుగ పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. అనంతపురం ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు రషీద్ బాషా, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాట్లాడారు. 7వ అనంత షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2వరకు లఘు చిత్రాల డైరెక్టర్లు, కొరియో గ్రాఫర్లు, కళాకారులు వారి ప్రతిభను నిరూపించుకోవాల్సి ఉంటుందన్నారు.

కుందుర్పిలో పర్యటించిన స్పెయిన్ బృందం



విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్పెయిన్ బృందం

కుందుర్పి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో 30 మంది స్పెయిన్ బృందం మంగళవారం పర్యటించింది. కుందుర్పిలో కంబదూరు, కుందుర్పి మండలాలకు చెందిన పేదలు విరాళాల ద్వారా సేకరించిన రూ.3 కోట్లతో విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ ఆలయాన్ని నిర్మించడం సంతోషకరమన్నారు. తమ్మయ్యదొడ్డి, బండమీదపల్లి, కుందుర్పి తదితర గ్రామాల్లో రైతులు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన వివిధ రకాల పంటలను వారు పరిశీలించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వైబీ ఓబయ్య, ఏరియా టీం లీడర్ సురేష్ , కమిటీ సభ్యులు రాజగోపాల్, నీరుగంటి శ్రీరాములు, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

పేదల కాలనీలపై పెద్దల కన్ను



రాయదుర్గంలోని గౌడ లేఔట్‌లో ఆక్రమణకు గురవుతున్న ఖాళీ స్థలాలు

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల కబ్జా
- కనిపించని రిజర్వు స్థలాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- సామాజిక ప్రయోజనాల కోసం అవస్థలు

రాయదుర్గం: పట్టణం పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది..రహదారులు ఉన్నాయి.. వస్త్ర వ్యాపారం ఊపందుకుంది. జీన్స్ ఉత్పత్తులూ జోరుగా సాగుతున్నాయి.. కూలీలు, కార్మికుల అవసరం ఎక్కువగానే ఉంది. ఇంకేముందీ..పల్లెలు వీడి పట్టాణాలకు వలస వెళ్లే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. భూముల విలువ అమాంతం పెరిగిపోయింది. రాయదుర్గంలో విలువైన స్థలాలు కనిపిస్తే చాలు..భూ బకాసురులు రెచ్చిపోతున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా కాజేస్తున్నారు. అడిగేవారెవరు? అడ్డుకునేదెవరు అంటూ ఆక్రమించేస్తున్నారు. యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి లేఅవుట్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.

రాయదుర్గం పట్టణ ప్రాంతంలో 2006లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం బీటీపీ, గౌడ, మల్లాపురం, భంభం స్వామి, గ్యాస్ గోడౌన్‌ల వద్ద సుమారు 80 ఎకరాల భూములు కొనుగోలు చేసి, లేఔట్లు ఏర్పాటు చేశారు. అందులో 30-40 అడుగుల వెడల్పుతో రోడ్లు వేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అవసరాల కోసం అన్ని లేఔట్లలోనూ 50 నుంచి 60 సెంట్లు (అర ఎకరం)కు పైగా కేటాయించారు. మిగిలిన విస్తీర్ణంలో అర్హత ఆధారంగా ఒక్కో లబ్ధిదారుడికి 2.50 సెంట్ల ప్రకారం పంపిణీ చేశారు. కొందరు ఇళ్లు నిర్మించుకోగా, చాలా మంది హద్దులు ఏర్పాటు చేసి ఖాళీగా వదిలేశారు.

భూమి విలువ పెరగడంతో ఆక్రమణలు...

లేఔట్లు ఏర్పాటైన సమయంలో దూరాభారం అంటూ చాలా మంది లబ్ధిదారులు నిర్లక్ష్యం చేశారు. ప్రస్తుతం పట్టణం పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. బైపాస్ దారులు, వస్త్ర వ్యాపారం, జీన్స్ ఉత్పత్తులు క్రమంగా పెరిగిపోయాయి. దీంతో కూలీల అవసరం ఎక్కువైంది. గ్రామాలు వదిలి పట్టాలణాలకు చేరే వారి సంఖ్య క్రమంగా పెరిగింది. భూముల విలువలు అమాంతం పెరిగిపోయాయి. ప్రస్తుతం ఈ లేఔట్ల చుట్టూ ఉన్న ప్రైవేట్ వెంచర్లలో సెంటు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు ధర పలుకుతోంది. దీంతో కబ్జాదారుల కన్ను పడింది. నిరుపేదలకు చెందాల్సిన స్థలాలన్నీ కబ్జాదారుల కబంద హస్తాల్లోకి చేరాయి. గుడి, బడి పేరుతో ఖాళీగా ఉంచిన రిజర్వు స్థలాలను కూడా కొందరు స్వాధీనం చేసుకున్నారు. బోగస్ పట్టాలు సృష్టించి, ఒక్కో స్థలాన్ని రూ.2 నుంచి రూ.3 లక్షల దాకా విక్రయిస్తున్నారు. వీటికి ఆనుకొని ఉండే కొండలు, గుట్టలను సైతం కరిగించేసి ప్లాట్లు వేసేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ సమావేశంలోనూ ఈ అక్రమ ప్లాట్లపై బాగోతంపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. అర్హులకు న్యాయం చేయాలని పట్టుబట్టారు.

అక్రమాల నిగ్గు తేల్చేందుకు కమిటీల ఏర్పాటు..

ఇందిరమ్మ లేఔట్లలో అక్రమాలు నిగ్గు తేల్చేందుకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా కమిటీలు తయారు చేశారు. గతంలో ఇచ్చిన జాబితా ఆధారంగా అర్హులు ఎవరూ? అనర్హులు ఎంత మంది ఉన్నారని గుర్తించేందుకు సిద్ధమయ్యారు. అయితే కార్యాచరణ చేపట్టడంలో జాప్యం చేస్తున్నారు. ఇది వాస్తవానికి దగ్గరగా జరిగితే తహసీల్దార్ సంతకాలతో తయారు చేసిన బోగస్ పట్టాలు, వాటి వెనుక దాగిన అక్రమాలన్నీ వెలుగులు చూస్తాయి. సత్వరం విచారణ జరిపించి, అర్హులకు న్యాయం చేయాలని ప్రజా సంఘాలు, విపక్ష పార్టీలు, లబ్ధిదారులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. దురాక్రమణకు గురైన రిజర్వు స్థలాలను పరిరక్షించి, సామాజిక ప్రయోజనాలకు ఉపయోగించాలని కోరుతున్నారు.

సర్వే కమిటీలు నియమించాం

ఇందిరమ్మ లేఔట్లలో దురాక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలు గుర్తించేందుకు ప్రత్యేకంగా కమిటీలు నియమించాం. ప్రస్తుతం విచారణ ప్రారంభమైంది. అర్హులు ఎవరు? అనర్హులు ఎంత మంది ఉన్నారో గుర్తిస్తాం. రిజర్వు స్థలాలు ఖాళీ చేయించి, ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా చేస్తాం. బోగస్ పట్టాలని తేలితే కఠిన చర్యలకు ఆదేశిస్తాం. ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించేలా చర్యలు చేపడతాం.

– నాగరాజు, తహసీల్దార్, రాయదుర్గం

లేఔట్లలో ఆక్రమణలపై చర్యలు చేపట్టండి



మల్లాపురం లేఔట్లలో అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు

రాయదుర్గం: పట్టణంలోని ప్రభుత్వ లేఔట్లలో ఆక్రమణలపై సత్వరం చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధికారులను ఆదేశించారు. మంగళవారం కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు, కోఆప్షన్ సభ్యుడు నజీర్, శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జులు పొరాళ్ల శివ, ఇస్మాయిల్, నిజాముద్దీన్, దివాకర్‌తో కలసి మల్లాపురం లేఔట్‌ను సందర్శించారు. అందులో గుర్తించిన అక్రమ కట్టాలపై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజుల దృష్టికి తీసుకెళ్లారు. బోగస్ పట్టాలు కూడా సోషల్ మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్న విషయాన్ని ప్రస్తావించారు. సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించారని గుర్తు చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో చిత్తయ్య, లక్ష్మి అక్కడికి చేరుకున్నారు. దురాక్రమణలపై విచారణ చేశారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను అడ్డుకున్నారు. కొందరి వద్ద ఉండే బోగస్ పట్టాలు గుర్తించి చర్యలు చేపడతామని తెలిపారు. వివిధ వార్డులకు చెందిన ఇన్‌చార్జులు, అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు పట్టుబడిన ఇసుక దొంగలు

- వ్యాపారంగా మార్చుకుని వేదావతిని ఊడ్చేసిన తమ్ముళ్లు
- అర్ధరాత్రి వేళ రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీస్ స్టేషన్‌లో ఉంచిన ఇసుక ట్రాక్టర్

గుమ్మఘట్ట: మండలంలో ఇసుక వ్యాపారంలో ఆరితేరిన ఇద్దరు దొంగలు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. తాళ్లకెర, బీటీపీ గ్రామాల మధ్యలో టీడీపీ నాయకుడు బెస్త మూర్తి వ్యవసాయ పొలంలో రాత్రి వేళల్లో వేదావతి హగరి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక డంప్ చేసి, గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటకకు టిప్పర్లలో తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో దాడి చేశారు. రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. బీటీపీకి చెందిన టీడీపీ నాయకుడు బెస్త మూర్తి, తాళ్లకెరకు చెందిన బోయ పాలయ్యకు చెందిన ట్రాక్టర్లుగా పోలీసులు గుర్తించారు.

టీడీపీ నాయకులే ఉన్నతాధికారులకు ఫిర్యాదు : మూడు రోజుల క్రితం టీడీపీ నాయకులు బీటీపీ బెస్త మూర్తి,శివ ఇసుక అక్రమ రవాణా వ్యవహారంతో ఘర్షణపడ్డారు. తాను చెప్పినట్లుగా వినాలని ఒకరినొకరు తీవ్ర స్థాయిలో గొడవపడ్డారు. టీడీపీ నాయకుల అక్రమాలకు అడ్డు అదుపులేకుండా పోయింది. వీరి ఆగడాలు టీడీపీ నాయకులే భరించలేకపోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిత్యం సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత వేదావతి హగరి నుంచి ఇసుకను అక్రమంగా బీటీపీ,తాళ్లకెర గ్రామాల మధ్యకు తరలించి, అక్కడ నుంచి టిప్పర్ల ద్వారా రాత్రి వేళల్లో కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. టీడీపీ నాయకుల మధ్య సఖ్యత లేక విభేదాలు భగ్గుమన్నాయి. ఇసుకను పట్టపగలే కర్ణాటకకు తరలిస్తుండడంతో టీడీపీ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

చూసీ చూడనట్లు వ్యవహరించిన పోలీసులు: టీడీపీ నాయకులు మూడు నెలలుగా రాత్రి వేళల్లో ఇసుక కర్ణాటకకు తరలిస్తున్నా పోలీసులకు పక్కా సమాచారం ఉంది. అయినా చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. అక్రమ ఇసుక డంప్‌లపై పోలీసులు దాడులు చేసేందుకు సాహసించలేకపోయారని బహిరంగ విమర్శలు వచ్చాయి. అక్రమ ఇసుక రవాణాపై ఇంటలిజెన్స్ విభాగాల ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో రూరల్ సీఐ వెంకటరమణ దాడి చేసి, కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ వెంకటరమణ మాట్లాడుతూ ఇంటి అవసరాల కోసం సమీపంలో ఉన్న ఇసుకను తరలించుకోవచ్చన్నారు. అలా కాకుండా నదీ పరివాహక ప్రాంతాలు, వంకలు, వాగుల్లో అనధికారికంగా తరలించి, వ్యాపారం చేస్తే చర్యలు తప్పవన్నారు.

పశుగణన వందశాతం పూర్తి

- జిల్లాలోనే ఉరవకొండ డివిజన్‌లో రికార్డు సర్వే
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు



బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లిలో పశుగణనను పర్యవేక్షిస్తున్న పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేష్

ఉరవకొండ: ఉరవకొండ డివిజన్‌లో పశుగణన ఇంటింటి సర్వే వందశాతం పూర్తయ్యింది. జిల్లాలోనే ఉరవకొండ డివిజన్ రికార్డు స్థాయిలో సర్వే పూర్తయ్యింది. పాడి పరిశ్రమ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లకోసారి చేపట్టే పశుగణన కార్యక్రమం గతేడాది నవంబర్ మొదటి వారంలో ప్రారంభమైంది. పశుగణనలో ఆవులు, ఎద్దులు, దున్నలు, కుక్కలు, గాడిదలు, పందులు, కుందేళ్లు, గొర్రెలు, మేకలు, కోళ్లు, గుర్రాలతో పాటు అనేక రకాలైన పశువులను ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి గుర్తించారు. పశుగణన సర్వేలో భాగంగా గ్రామాల్లోని ప్రతి నివాసాన్ని గణనకర్తలు సందర్శించారు. ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో 15 మండలాలు ఉండగా, మొత్తం 2,34,763 గృహాలు ఉన్నాయి. ఉరవకొండ డివిజన్‌లో ఆవులు 1,33,742, గేదెలు 82,028, గొర్రెలు 11,84354, మేకలు 2,43,215, కోళ్లు 2,90,382 ఉన్నాయి. పశుగణన కార్యక్రమంలో 82 మంది ఎన్యుమరేటర్స్, 18 మంది సూపర్‌వైజర్లతోపాటు ఏవీహెచ్‌ఏడీ, డాక్టర్లులు పాల్గొన్నారు. 2024 నవంబర్ 8 నుంచి ఫిబ్రవరి 28 వరకు జరిగే అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ఉరవకొండ డిజవిన్ లో వందశాతం ఇంటింటి సర్వే విజయవంతంగా పూర్తి చేశారు.

సమష్టి కృషితో వంద శాతం పూర్తి

డివిజన్ పరిధిలో పశుగణన సర్వేను సవాలుగా తీసుకొని పారదర్శకంగా పూర్తి చేసేలా ఎన్యుమరేటర్లు, సిబ్బంది సమష్టి కృషితో వందశాతం గృహాలను సందర్శించాం. చిన్నపాటి తేడా లేకుండా లెక్క పక్కాగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. గృహ సందర్శన పూర్తి చేసి ప్రస్తుతం గత ఐదేళ్ల క్రితం చేసిన సర్వేతో ప్రస్తుతం చేసిన సర్వేను సరిచేస్తూ పశుగణన వివరాలను రాబట్టాం.

– డాక్టర్ జీ.వెంకటేష్, పశుసంవర్ధక శాఖ డీడీ, ఉరవకొండ

ప్రత్యేక ఆధార్ క్యాంప్

శెట్టూరు: మండలంలో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు తెలిపారు. 22న అడవిగొల్లపల్లిలో, 23, 24న బచ్చేహళ్లిలోనూ, 27, 28న లింగదీర్లపల్లిలో, 29,30న చింతర్లపల్లి గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తత అవసరం

బొమ్మనహాళ్: పాడి పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి వెంకటరెడ్డి తెలిపారు. నేమకల్లు, సిద్దరాంపురంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లి, కుందుర్పి తదితర గ్రామాల్లో శిబిరాల ఏర్పాటు చేశారు. మందులు అందించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ మల్లికార్జున,గోపాల మిత్రలు పాల్గొన్నారు.

జింక పిల్ల అప్పగింత



జింక పిల్లను అప్పగిస్తున్న రైతు చంద్రశేఖర్‌రెడ్డి

బెళుగుప్ప: మండల కేంద్రానికి చెందిన రైతు వై.చంద్రశేఖర్‌రెడ్డి జింక పిల్లను పోలీసులకు మంగళవారం అప్పగించాడు. గ్రామ సమీపంలోని తమ పొలంలో కంది పంట నూర్పిడి చేస్తుండగా, నెల రోజులు వయసున్న జింక పిల్ల కంది కుప్పలో ఇరుక్కుపోయింది. జింక పిల్లను రక్షించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, గుండ్లపల్లి అటవీశాఖ సిబ్బంది నాగరాజు, స్థానిక పోలీసు శివకు అందజేశాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కూడేరు: కూడేరు బస్టాండ్‌లో అనంతపురం- బళ్లారి రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నేకోటకు చెందిన రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. రామాంజనేయులు తన కుమారుడితో కలిసి కడదరకుంటకు ఊరుదేవరకు వెళ్లి ద్విచక్రవాహనంలో సొంతూరుకు వెళ్తుండగా కూడేరు వద్ద ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన రామాంజనేయులును 108 వాహనంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'తల్లికి వందనం' అమలు చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేసి, చిత్తశుద్ధి చాటుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ మండిపడ్డారు. మంగళవారం స్థానిక పీడీఎస్ కార్యాలయంలో పీడీఎస్ నాయకులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేతులెత్తేసిందన్నారు. ఈ విద్యాసంవత్సరంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేస్తుందని నమ్మకంతో బడికి పంపితే వారిని నిలువునా చంద్రబాబు, పవన్, నారా లోకేష్‌లు మోసగించారన్నారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని చెప్పి జనవరి నెల పూర్తయినా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసగించారన్నారు.

ఊరూరా దేవర



బొమ్మనహాళ్‌లో దేవమ్మదేవి అమ్మవారు



కళ్యాణదుర్గంలో అలంకరణలో అమ్మవారు



బెళుగుప్ప మండలం యలగలవంకలో కొల్లాపురమ్మ దేవత



బొమ్మనహాళ్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బొమ్మనహాళ్/కళ్యాణదుర్గం రూరల్/కుందుర్పి/కూడేరు/బెళుగుప్ప: బొమ్మనహాళ్‌లో మంగళవారం దేవమ్మదేవి అమ్మవారి దేవర ఘనంగా జరిగింది. అమ్మవారికి సోమవారం రాత్రి నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలు ఉత్సవం నిర్వహించారు. దాదాపు వందేళ్ల అనంతరం గ్రామస్తులు చేస్తున్న దేవమ్మదేవి అమ్మవారి దేవరను పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున అమ్మవారికి బలి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు, గ్రామపెద్దలు తెలిపారు.

» **కనుల పండువగా మల్లిపల్లి జాతర :** కళ్యాణదుర్గం పరిధిలోని మల్లిపల్లిలో చౌడేశ్వరి అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. జాతరకు వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వనాయుడు హాజరయ్యారు. ప్రజలు పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తలారి సత్తి, ఎంపీపీ మారుతమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, తిమ్మగానిపల్లి మల్లి, చిత్తయ్య, స్వామి, నరేష్, వేణు, నరసిహులు, బాబు పాల్గొన్నారు.

» **జనసంద్రమైన కదదరకుంట :** కూడేరు మండలంలోని కడదరకుంటలో బొడ్రాయి, ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా ఊరు దేవర నిర్వహించారు. వందేళ్ల తర్వాత జరిగిన ఊరుదేవరకు గ్రామస్తులు బంధుమిత్రులను పెద్దఎత్తున ఆహ్వానించడంతో గ్రామం జనసంద్రమైంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి, జంతు బలి ఇచ్చారు.

» కుందుర్పి మండల సరిహద్దునున్న కొత్తపల్లిలో మారెమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. 50 ఏళ్లకోసారి మారెమ్మ జాతర నిర్వహించినట్లు గ్రామస్తులు అంజినాయక్, చిన్నవెంకటరెడ్డి, చింతలరెడ్డి, మాజీ సర్పంచ్ మల్లికార్జున తదితరులు తెలిపారు. ఉదయం అమ్మవారి గంగపూజ, మధ్యాహ్నం గ్రామోత్సవం, సాయంత్రం గ్రామశాంతి నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి పూజలు చేశారు. బుధవారం గావు తీసే కార్యక్రమంతో జాతర ముగుస్తుందని గ్రామస్తులు తెలిపారు.

» బెళుగుప్ప మండలంలోని యలగలవంకలో గ్రామ దేవత కొల్లాపురమ్మ అమ్మవారి జాతర మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక శాంతిహోమాలు, పుట్ట పూజలు నిర్వహించారు. గ్రామస్తులు బోనాలతో రతి బోనాలకు పూజలు నిర్వహించి, పొలిమేరలో చల్లించి, శాంతి పూజలు చేశారు. 11ఏళ్ల తర్వాత గ్రామ జాతర జరగడంతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎస్‌ఐ శివ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.







కదదరకుంటలో దేవరకు హాజరైన జనం, కుందుర్పి మండలం కొత్తపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు, కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి జాతరలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత ఉమా

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దాస్‌నాయక్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులందరూ హాజరు కావాలన్నారు.

శెట్టూరు: మండల స్థాయి సాధారణ సర్వసభ సమావేశం ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు ఓ ప్రకటనలో తెలిపారు. 16 గ్రామ పంచాయతీల నుంచి ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలన్నారు.

వైభవంగా పెద్దమ్మ జాతర



పెద్దమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

వజ్రకరూరు: పందికుంట గ్రామంలో మంగళవారం పెద్దమ్మ అమ్మవారి దేవర వైభవంగా జరిగింది. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. దేవరకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి హాజరయ్యారు. అనంతరం భీమిరెడ్డి గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇళ్లకు వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు.